నిరుద్యోగ భృతికి ఎదురుచూపులు

- సూపర్‌సిక్స్‌లో ఎన్డీఏ కూటమి కీలకహామీ
- 'గుడివాడ' 69,100, 'పామర్రు'లో 49 వేలు, 'కైకలూరు'లో 77 వేల మందికి పైగా అర్హులు

గుడివాడరూరల్: 'భృతి' కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇంటికొక ఉద్యోగం... లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్డీఏ కూటమి ఎన్నికల ముందు ప్రచారంలో ఊదరగొట్టింది. కూటమి అధికారంలోకి రావడంతో సూపర్‌సిక్స్ హామీలో అత్యంత ముఖ్యమైంది ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి అందజేస్తుందోనని యువత ఎదురు చూస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో గుడివాడటౌన్‌తోపాటు, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలు ఉన్నాయి. వీటిలో 69,100 గృహాలు ఉన్నాయి. గుడివాడటౌన్‌లో 29,560, గుడివాడ మండలంలో 11,540, గుడ్లవల్లేరులో 16,000, నందివాడలో 12000 గృహాలు ఉన్నాయి.

ఎన్నికల వేళ గుడివాడలో చంద్రబాబు, కల్యాణ్ హామీ

అష్టకష్టాలు ఎదుర్కొని విద్యనభ్యసించిన యువత సరైన ఉపాధి అవకాశాలు లేక జీవిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్ ప్రకటించాయి. దీనిలో ముఖ్యంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేక నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అని ప్రకటించాయి. ఎన్నికల ప్రచార సమయంలో గుడివాడ మండలం మల్లాయపాలెం వద్ద జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు, నెహ్రూచౌక్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ సూపర్‌సిక్స్ హామీలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఇందులో ప్రధానంగా యువతకు ఉద్యోగాల కల్పన, ఉద్యోగం లభించే వరకు నెలకు రూ.3 వేలు భృతి కల్పించడానికి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ హామీని నమ్మిన యువత కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో, తాము చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం సాధించాలనే తపనతో యువత ఉన్నారు. అప్పుడే పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా ఫీజులు కట్టి శిక్షణపొందుతున్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చే వరకు కనీసం ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆశతో నిరుద్యోగ యువత ఎదురు చూస్తున్నారు.



ఎప్పుడు అమలుచేసేనో..

పామర్రు: చంద్రబాబునాయుడు ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు పెట్టుకున్న యువత ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తి అయినా ఇంత వరకు ఆ అంశాన్నే ప్రస్తావించక పోవడంతో ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా దీనిపై స్పష్టత లేదని, ఎప్పటి నుంచి అమలుచేస్తారో చెప్పాలని నిరుద్యోగులు కోరుతున్నారు. పామర్రు నియోజకవర్గంలో సుమారు 49 వేల మంది అర్హులు ఉన్నారు. పామర్రు మండలంలో 12,500, పమిడిముక్కల 11 వేలు, తోట్లవల్లూరు 7, 500, పెదపారుపూడి 7 వేలు, మొవ్వ మండలంలో 11 వేలు మంది అర్హులు ఉన్నారు. ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడం జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టత ఇవ్వండి

'కైకలూరు'లో 77వేల మంది నిరుద్యోగులు

కైకలూరు: నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని ప్రజాగళం పేరుతో ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చారు. ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టి నెల రోజులు దాటినా భృతి అంశంపై చర్చించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 2014–19లో ఎన్నికల సంవత్సరంలో నాటి టీడీపీ ప్రభుత్వం యువనేస్తం పేరుతో 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు కేవలం డిగ్రీ చదివిన వారికే భృతి అమలు చేశారు. అప్పట్లో నాలుగు చక్రాల వాహనాలకు డ్రైవింగ్ లైసెన్సులు, 120 సీసీ ద్విచక్ర వాహనాలు కలిగిన వారిని మినహాయించారు. అనేక నిబంధనల కారణంగా కొంతమందికే నిరుద్యోగ భృతి అందింది. ప్రభుత్వం నిరుద్యోగభృతిపై స్పష్టత ఇవ్వాలని కైకలూరు నియోజకవర్గంలోని 77 వేల మంది నిరుద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగం కోసం చూస్తున్నా..



డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు నోటిఫికేషన్ విడుదల చేస్తే అర్హతకు తగ్గ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. ఇప్పటికే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా.

–జె.విఖ్యాత్, గుడివాడ

నిరుద్యోగ భృతి ఎప్పుడో



కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇంతవరకు భృతిని ప్రభుత్వం ప్రకటించలేదు. ఎప్పటికి నిరుద్యోగులకు భృతి ఇస్తారో చెబితే బాగుంటుంది. ఉద్యోగాలు లేని యువతకు నిరుద్యోగ భృతి ఇస్తే ఆర్థికంగా కొంతమేరకు ఉపశమనం ఉంటుంది.

– గళ్లా కేశవ, చిత్రం, గుడ్లవల్లేరు మండలం

అమలుచేయండి



నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా లక్షలాది మంది నిరుద్యోగులు వయో పరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిని అమలు చేయాలని కోరుకుంటున్నాం.

– వి.అనిల్‌కుమార్, నిరుద్యోగి

నెల రోజులు దాటింది



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతోంది. ఇంకా నిరుద్యోగ భృతిపై స్పష్టత లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి భృతి ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలి.

–వి. దయాకరరావు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు మండలం

ఎదురుచూస్తున్నా..



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నా. బీటెక్ పూర్తిచేసి ఏడాది దాటింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించేందుకు శాప్ కోర్సు నేర్చుకుంటున్నా. ఈ సమయంలో చంద్రబాబు నిరుద్యోగభృతిగా నెలకు రూ.3వేలు వంతున అందిస్తే విజయవంతంగా కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధిస్తా.

– చిట్టూరి శివ, బీటెక్, లింగాల.

జాబ్ క్యాలెండర్ ఏదీ?



ఏపీలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. నేను ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరేందుకు సిద్ధమవుతున్నాను. జాబ్ క్యాలెండర్ కంటే ముందు పాత నోటిఫికేషన్లు పూర్తి చేయాలి. ఈ లోపల నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి నెలా రూ. 3 వేలు భృతి వెంటనే అమలు చేయాలి. పథకం అమలుకు స్పష్టమైన తేదీలు ప్రకటించాలి.

– బాదిన సామియేలుబాబు, పెరికెగూడెం

తక్షణం నిరుద్యోగ భృతి ఇవ్వాలి



గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా అర్హులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్టవుతుంది. నిరుద్యోగ భృతి కోసం అందరం ఎదురు చూస్తున్నాం.

– పెరుమాళ్ళ సాయికృష్ణ, పెరికెగూడెం

క్లుప్తంగా

యువత నైపుణ్యం పెంచుకోవాలి



ముదినేపల్లిరూరల్: ఉపాధి అవకాశాలను అందుకునేందుకు యువత నైపుణ్య వృద్ధిపై దృష్టి సారించాలని స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ అన్నారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా సోమవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి నైపుణ్యం మెరుగుపరచుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దీనికి పలు శిక్షణ సంస్థలు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు. ఇన్‌స్ట్రక్టర్లు వోలేటి మణి భీమరాజు, శివకుమార్ వివిధ నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు.

కౌలు కార్డులతో యజమానులకు నష్టం లేదు

కైకలూరు: కౌలు కార్డులతో ఆయా భూ యజమానులకు ఎటువంటి నష్టం లేదని విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో) వి.రవితేజ చెప్పారు. వింజరం గ్రామ రైతు సేవా కేంద్రంలో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమం వీఏఏ జయమంగళ కనకదుర్గ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని వీఆర్వో వివరించారు. వీఏఏ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుతో ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటకు నష్ట పరిహారం అందిస్తారన్నారు. అనంతరం పలువురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద ధర్మరాజుల సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి సారె



గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవి క్లబ్ విదర్భపురి మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. సోమవారం 108 మంది మహిళలతో 108 రకాల మిఠాయిలు, పూలు, పండ్లు సారెగా సమర్పించారు. కార్యక్రమంలో వాసవి విదర్భపురి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజినీకుమారి, జోనల్ చైర్మన్ జిల్లా సుధారాణి, అధ్యక్షురాలు చీదెళ్ల లక్ష్మి, కార్యదర్శి సీహెచ్ లక్ష్మీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు స్థలంలో చెరువు తవ్వకంపై ఫిర్యాదు

కై కలూరు: గ్రామానికి చెందిన డంపింగ్ యార్డు స్థలంలో అనుమతుల్లేకుండా చేపల చెరువు తవ్వుతున్నారని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు అందింది. రాచపట్నం సర్పంచ్ అల్లూరి మంగారావు అధికారులకు ఫిర్యాదు అందజేశారు. గ్రామానికి చెందిన పుంత స్థలం సుమారు 45 సెంట్లు ఉందన్నారు. దీనిలో కొంత భాగం డంపింగ్ యార్డును నిర్మించాలని మూడేళ్ల క్రితం పంచాయతీలో తీర్మానం చేసినట్టు తెలిపారు. కొందరు వ్యక్తులు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంతోపాటు మొత్తం ప్రాంతంలో చేపల చెరువు తవ్వుతున్నారని తెలిపారు. తక్షణం పనులను ఆపి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. తహసీల్దార్.. ఫిర్యాదును ఎంపీడీవోకు పంపించారు. ఆయన ఈవోపీఆర్డీతో విచారణ చేయిస్తానని తెలిపారు.

తాగునీటి చెరువులకు నీటి విడుదల



కై కలూరు: నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఆయన పట్టిసీమ నీటిని సోమవారం కోరుకొల్లు లాకుల నుంచి క్యాంప్‌బెల్ దిగువకు గేట్లు ఎత్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా స్వచ్ఛందంగా రైతులు కాలువల మరమ్మతులకు ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటిని తాగునీటి చెరువుల్లో నింపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, రాష్ట్ర చేపల రైతు సంఘ అధ్యక్షుడు వెంకట్రామరాజు, నేతలు పాల్గొన్నారు.

పెరికెగూడెంలో డ్రెయిన్ అభివృద్ధి పనులు

మండవల్లి: పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యాన యాదవుల బజారులో సోమవారం డ్రెయినేజీ అభివృద్ధి పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డ్రెయిన్లు సక్రమంగా లేక పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అంటువ్యాధులు ప్రబలడమే కాకుండా దోమలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో డ్రైన్ల అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీపీ స్కూల్‌కు పైప్‌లైన్ కనెక్షన్

స్థానిక ఎంపీపీ స్కూల్‌కు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా, తాగునీరు అందించే పైప్‌లైన్ దెబ్బతింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ మెండా ఝాన్సీ విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా త్వరితగతిన పైప్‌లైన్ మరమ్మతులకు సోమవారం చర్యలు తీసుకుని నీటి సరఫరాను పునరుద్ధరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.



మండవల్లి ఎంపీపీ స్కూల్ వద్ద పైప్‌లైన్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ ఝాన్సీ

నీటి ప్రవాహానికి అడ్డంకి

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన పోల్‌రాజ్ పంట కాల్వలో నీటి సరఫరాకు పలుచోట్ల గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. ఇటీవల ఈ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వచ్చే నీటితో పాటు గుర్రపు డెక్క కూడా కొట్టుకురావడంతో పలుచోట్ల నీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉంది. కొట్టుకువచ్చిన గుర్రపుడెక్క పోల్‌రాజ్ కాల్వపై నిర్మించిన వంతెనల కానాల వద్ద పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించింది. ముదినేపల్లిలోని కాలిబాట వంతెన వద్ద పలుచోట్ల కానాల వద్ద గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయింది. ఈ కాల్వకు దిగువన ఉన్న గ్రామాలకు సాగు, తాగునీరు అందడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుర్రపు డెక్కను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ముదినేపల్లి పోల్‌రాజ్ కాల్వపై కాలిబాట వంతెన వద్ద పేరుకున్న గుర్రపు డెక్క

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు 20 వరకు గడువు

పామర్రు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

పామర్రు: పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం(కంప్యూటర్) కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 20వరకు గడువు ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక టీఎస్ఆర్ అండ్ ఈఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాలలోనే ప్రారంభించామని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తైన విద్యార్థులు డిగ్రీలో చేరవచ్చన్నారు. కళాశాలలో చేరిన పేద విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు 6నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్, 10వ తరగతి మార్కుల లిస్టు, ఇంటర్ మార్కుల లిస్టు, స్టడీ , క్యాస్టు సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు, ఇన్‌కం సర్టిఫికెట్, ఓటీపీ కోసం మొబైల్ ఫోన్, పాస్ పోర్టు సైజ్ ఫోటోలను తీసుకురావాలని సూచించారు. కళాశాలలో జేకేసీ, కంప్యూటర్ ల్యాబ్, చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమెడియల్ తరగతులు, కెరీర్ గైడెన్స్, డిజిటల్‌క్లాస్ రూమ్స్, లైబ్రరీ, మోడరన్ జిమ్, బస్‌పాస్, ప్రభుత్వ పథకాలు, టాయిలెట్లు, పార్కింగ్ తదితర సదుపాయాలు కళాశాలలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళి, రవి, ప్రభావతి, సునీత పాల్గొన్నారు.

రహదారులపై వాన నీరు



గుడివాడలో రోడ్డుపై నిలిచిన వాన నీరు



వడాలి ప్రధాన సెంటర్లో రోడ్డుపై ఏర్పడ్డ భారీ గోతులు

గుడివాడ టౌన్: పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎడతెరపిలేని వర్షానికి రోడ్లు నీట మునిగాయి. రహదారులు జలమయంకావడం, మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రధాన డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లి రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర అవస్థ పడుతున్నారు. మండలంలోని ముదినేపల్లి నుంచి బంటుమిల్లి వెళ్లే రోడ్డులో వడాలి ప్రధాన సెంటర్ వద్ద వడాలి నుంచి తామరకొల్లు వెళ్లే రోడ్డులో చినకామనపూడి, నరసన్నపాలెం, చిగురుకోట సెంటర్లలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు వెళ్లే రోడ్డులో గురజ వద్ద.. గుడివాడ వెళ్లే రోడ్డులో పలు గ్రామాల వద్ద రహదారులపై భారీ గోతులు పడటంతో జనం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



టీబీ నివారణపై మాట్లాడుతున్న ఎస్టీఎస్ వినయ్‌కుమార్

కైకలూరు: టీబీ రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని టీడీ సీనియర్ టెక్నీషియన్ సూపర్‌వైజర్ (ఎస్టీఎస్) బృందవనం వినయ్‌కుమార్ చెప్పారు. కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో కలిదిండి, కోరుకొల్లు, మూలలంక పీహెచ్‌సీల సిబ్బందికి టీబీ నివారణపై సోమవారం నిర్వహించిన సమావేశంలో అవగాహన కల్పించారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ రెండు వారాలు విడవని దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా టీబీ ముక్తి భారత్ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ టీబీ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం టీబీ చికిత్స కోసం ఒక్కో రోగికి రూ.10 లక్షలు వరకు ఖర్చు చేస్తోందన్నారు. పీహెచ్‌సీల డాక్టర్లు జాహ్నవి, ధీరజ్‌కుమార్, హేమంత్ మాట్లాడుతూ స్టాప్ మలేరియా కార్యక్రమాన్ని అందరూ దిగ్విజయం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కిషోర్, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వీరాంజనేయుని హుండీ ఆదాయం రూ.4.54 లక్షలు

పామర్రు: పామర్రులోని ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,54,402 వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి వి.సుధాకర్ తెలిపారు. ఆలయంలో సోమవారం భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తనిఖీ అధికారిగా వ్యవహరించారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు 52 రోజుల పాటు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా సభ్యులు పాల్గొన్నారు.

సాగుకు సిద్ధం కండి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: వ్యవసాయానికి అవసరమైన నీటిని పట్టిసీమ ద్వారా తరలించిన సందర్భంలో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆయన స్థానిక పామర్రు రోడ్డులోని గుడివాడ కెనాల్(పెద్దకాల్వ) వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా వదిలామన్నారు. వ్యవసాయానికి సరిపడా 4 క్యూసెక్కుల నీటిని సరఫరా చెయ్యగలమని ఇరిగేషన్ అధికారులు తెలిపారన్నారు. వీటితో పాటు తాగునీటికి అవసరమైన నీటిని సైతం పట్టిసీమ ద్వారా వదులుతున్నామన్నారు. హెడ్‌వాటర్‌వర్క్స్‌లో 40 హెచ్‌పీ మోటార్లు 2, 10 హెచ్‌పీ మోటార్లు 10 ద్వారా నీటిని నింపే కార్యక్రమం చేపట్టామన్నారు. త్వరలోనే చెరువులు రెండూ నింపుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యానికి మారుపేరు జంధ్యాల పాపయ్యశాస్త్రి

గుడివాడ టౌన్: సాహిత్యాన్ని సమాజహితానికి ఆపాదించిన గొప్ప సాహితీవేత్త జంధ్యాల పాపయ్యశాస్త్రి అని గుంటూరు మహిళా కళాశాల సంస్కృత విశ్రాంత రీడర్ వెలివోలు నాగ రాజ్యలక్ష్మి అన్నారు. భారతీసమితి సాహిత్య కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ వేదికపై పాపయ్యశాస్త్రి సాహిత్యంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జాతీయ భావాలు, నైతిక విలువలు జంధ్యాల రచించిన ప్రతి రచనలో కనిపిస్తాయన్నారు. ఆయన రచించిన ప్రతి కావ్యంలోనూ సామాజిక సందేశం దాగిఉందన్నారు. ఇంతటి గొప్ప వ్యక్తిని గుర్తుచేసుకోవడం నా భాగ్యంగా భావిస్తున్నానన్నారు. అనంతరం రాజ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారతి సమితి అధ్యక్ష కార్యదర్శులు డి.ఆర్.బి ప్రసాదు, ఎం.మాధవరావు, ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పోపూరి రాజేశ్వరి, డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం. వి. జి. ఆంజనేయులు, ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కె. ఎస్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రాజేశ్వరిని సత్కరిస్తున్న భారతి సమితి సభ్యులు

మొక్కలు నాటి సంరక్షించండి

కైకలూరు: మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కోరుకొల్లులో కెనాల్ లైన్ ప్లానిటేషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా కాల్వ సమీపంలో మొక్కలను ఎమ్మెల్యే నాటారు. మండల ఎన్ఆర్ఈజీఎస్ పీవో ఆనంద్ మాట్లాడుతూ కోరుకొల్లు నుంచి గుర్వాయిపాలెం వరకూ కెనాల్ లైన్ ప్లాంటేషన్‌లో భాగంగా 1,100 కొబ్బరి మొక్కలను నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మాజీ ఎంపీపీ వలవల రామారావు, కూటమి నేతలు జోగి రమేష్, వల్లభనేని శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కై కలూరు మండలం వేమవరప్పాడులో ఈ నెల 12న రోడ్డు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలో దుర్గాప్రసాద్, బోడావుల దుర్గాప్రసాద్ మృతి చెందారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కమ్మిలి విఠల్‌రావు, బీకేఎం నాని సోమవారం వేమవరప్పాడు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: స్థానిక పోలీసుస్టేషన్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు గోతులమయంగా మారడంతో పాటు కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీన్ని గుర్తించిన పంచాయతీ పాలకవర్గం 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

ఈ పనులకు రూ.30 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఏడు మీటర్ల వెడల్పున 165 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఈడే సుధాకర్, ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజల అవస్థలు తీరుతాయని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు. నిర్మాణ పనులను కార్యదర్శి టి.రమేష్, పంచాయతీరాజ్ ఏఈ పర్యవేక్షిస్తున్నారు.



ముదినేపల్లిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్, పంచాయతీ అధికారులు